కథానిలయం
3846
శ్రీకాకుళం

# మనిషి

ఒకసారి ఆరుగురినీ పరీక్షగా చూశాడతను.

ముఖాలకు తెల్లటి పౌడరు దట్టంగా పులుముకుని, కృత్రిమమైన చిరునవ్వులను ఇంకా దట్టంగా పులుముకుని -- ఒక వరుసలో వయ్యారంగా నించుని తన వేపే చూస్తున్నారు.

అందర్నీ పరీక్షగా చూసి, అతను ముఖం చిట్లించి ముందుకు కదలబోయాడు.

"మేమెవ్వరమూ మీకు నచ్చలేదా?" - ఎర్రటి చీర కట్టిన అమ్మాయి అన్నది, నములుతున్న కారాకిళ్ళీని బుగ్గన ఒక పక్కగా పెట్టి.

"ష్! నీకెన్నిసార్లు చెప్పాను -- అట్లా అనవసరంగా వాగవద్దని!" అరిచింది అందరిలోకీ కాస్త పెద్దగా కనబడుతున్న అమ్మాయి.

"జేబులో డబ్బులు లేకపోయినా, బాబుగారు ఏదో షికారు వచ్చారు కాబోలు!" అన్నది ఈ చివరి అమ్మాయి.

అతను చటుక్కున తల ఎత్తాడు.

అమ్మాయిని అదోరకంగా చూశాడు. ఫకాలున నవ్వింది.

ఇటువంటి స్థలాలకు రావటమే తప్పు. వచ్చిన తర్వాత కోపం తెచ్చు కోవటం మరీ తప్పు.

సర్దుకుని రెండడుగులు ముందుకు వేశాడు. అప్పుడే చూశాడామెను.

ప్రక్క గదిలోనించి ఒకతనితో బయటకు వచ్చింది.

అతను తల వంచుకుని గబగబా వెళ్ళిపోయాడు.

ఆమె చెదరిన ముంగురులను సరి చేసుకుంటోంది.

మళ్ళీ పరీక్షగా చూశాడామెను.

ఆమెలో అందం కన్నా, ఆకర్షణకన్నా, అంగసౌష్ఠవం కన్నా కూడా అదో గాంభీర్యం. దానికి తోడు ఆమె కళ్ళలో ఏవో తెలియని భావాలు విశాలంగా కనపడ్డాయి అతనికి.

చిన్నగా దగ్గాడు.

ఆమె తల ఎత్తింది.

ఆమెను సూటిగా చూశాడు. సన్నగా నవ్వాడు.

ఆమె కళ్ళతోనే ఏదో అడిగింది.

"ఊఁ!" అన్నాడు.

"రండీ!" చిన్నగా గదిలోకి నడిచింది.

ఇందాక వరసలో నుంచున్న ఆరుగురూ తననీ, ఆమెనీ అదోలా చూస్తున్నారు. తమలో తామే ఏదో గట్టిగా చెప్పుకుంటున్నారు.

అతను గదిలోకి అడుగు పెట్టాడు.

ఆమె తలుపు వేసింది.

ఆమె ఏదో చెప్పబోయింది.

అతను తలూపుతూ జేబులో నించి రెండు పది రూపాయల నోట్లు తీసి ఆమెకి ఇచ్చాడు.

ఒకసారి అతన్ని సూటిగా, వింతగా చూసింది.

దిండు క్రింద మంచి రెండు రెండు రూపాయల నోట్లను తీసి, అతనికి పధ్నాలుగు రూపాయలు అందించింది.

"ఉంచు!" అన్నాడతను.

"వద్దు!" అన్న దామె, మంచం మీద కూర్చుంటూ.

అతనూ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

ఆమె తన చేయి అతని చేయి మీద వేసింది.

అతను ఆమె కళ్ళలోకే దీక్షగా చూస్తున్నాడు.

ఆమె కళ్ళలో ఏవో లోతులు కనపడ్డాయి అతనికి.

అతను ఆమె కళ్ళలోకి ఇక ఎందుకో చూడలేకపోయాడు.

ఏదో ఆలోచన వచ్చింది.

చటుక్కున ఆమె చేయి విదిలించాడతను.

వింతగా చూసింది ఆమె.

ఒక క్షణం అదోరకంగా అయిపోయాడు.

"నీ దే ఊరు?" అడిగాడు.

"తెల్లగా ఉన్న నిర్మలాకాశం మీద కారు మబ్బులు నిర్విరామంగా అలా పరుగెడుతూనే

ఉంటాయి. వాటిని మీదే ఊరని అడిగితే ఏం చెబుతాయి!" అన్నదామె నిర్లిప్తంగా.

అతను కొంచెం ఆశ్చర్యంగా చూశాడామెను.

అతనిలో ఆమెను గురించి కలిగిన కుతూహలం రెట్టింపయింది.

ఆమె జారిపోయిన పైటను సర్దుకోవటానికి ప్రయత్నం చేయలేదు.

"అసలీ వృత్తిలోకి ఎందుకు దిగావ్?" అడిగాడు.

"నా చిన్నప్పుడు మా రామయ్యగారికో ఆవు ఉండేది. ఆయనికి ఆ ఆవు గుండెల మీద కుంపటి అయి, దాన్ని అమ్మేద్దామనుకున్నాడు. చివరకు అసలు మానవత్వమే లేని ఒకరికి అమ్మేశాడు కూడాను. వాళ్ళు ఆ ఆవును రోజూ హింసించి చాల బాధ పెట్టేవారు. ఎంత భరించినా, కొన్నాళ్ళకి భరించలేక ఆ పిరికితనంతోనే ఒక విధమైన ధైర్యం వచ్చి, వాళ్ళింట్లోంచి పారిపోయి మళ్ళీ రామయ్యగారి దగ్గరకే చేరింది. మా రామయ్యగారు ఆ ఆవును భద్రంగా వాళ్ళకే అప్పచెప్పారు. కొన్నాళ్ళ తర్వాత ఆ పోరు భరించలేక మళ్ళీ పారిపోయింది. తర్వాత ఈ లోకంలో స్వతంత్రంగా బతకలేకపోయింది. ఆ ఆవు ఎవరికి దొరికితే వాళ్ళు దాని వల్ల డబ్బు చేసుకుంటున్నారు" - గాఢంగా నిట్టూర్చింది ఆమె.

ఫాన్ గాలికి స్వేచ్ఛగా ఎగురుతున్న ఆమె ముంగురులను చూస్తూ, తనలో ఆమె మీద పెరుగుతున్న ఒక పవిత్రమైన అభిప్రాయాన్ని గమనించాడు.

ఒక్క క్షణం ఆగి అన్నాడు:

"నీ కీ వృత్తిలో హాయిగా ఉందా? ఇక్కడి నించీ ఎందుకు పారిపోవు?"

"ఒక కొలనులో కొన్ని చేపలు ఉండేవి. అక్కడ చిన్న చేపల్ని పెద్ద చేపలు తింటూ ఉండేవి. అందులో మరీ చిన్న చేపకి ప్రాణాంతక మయిపోయింది. ఏ రోజు ఏ పెద్ద చేప తనని తింటుందో అని ఆ కొలనులోనుంచి ఇంకో కొలనులోకి, అక్కణ్ణించే ఇంకో కొలనులోకీ మారింది. అయినా, ప్రతిచోటా పెద్ద చేపలు తనని తినటానికి సిద్ధమవుతూనే ఉన్నాయి. చివరికి ఒక పెద్ద చేప నోటికి చిక్కినప్పుడు అనుకున్నది -- అసలీ చేపల్లో పెద్దా, చిన్నా అన్న భేదమే ఉండకూడదు. ఆ భేదం ఉన్నంతవరకూ ఏ కొలనులోనయినా ఒకటే... అని".

చటుక్కున తల ఎత్తాడు అతను.

ఆమె తల వంచుకున్నా, ఆమె కన్నీళ్ళల్లోంచి కారిన వెచ్చని కన్నీరు అతని చేతి మీద పడి అతని సహృదయంలో ఎన్నో కెరటాలను ఉధృతంగా పైకి లేపింది.

అతను ఆమె భుజం మీద చేయివేశాడు.

"ఆలస్యం చేయకండి అవతల నా కోసం చాల మంది కాచుకుని ఉంటారు" నెమ్మదిగా అంది.

సూటిగా చూశాడొకసారి ఆమెని. చటుక్కున అడిగాడు -- "నాతో వచ్చేస్తావా? నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.

ఆమె అదిరిపడింది. అదోరకంగా చూసిందతన్ని.

అతను అనునయంగా ఆమె ముంగురులు నిమిరాడు.

"మా ఇంటి దగ్గర ఒక చిన్నపిల్లవాడు ఉండేవాడు. అతనికి రోడ్డు పక్కనే ఆడుకోవటం అంటే మహా సరదా. బురద గుంటల్లో కదులుతున్న పురుగుల్ని చూస్తే జాలి. ఆ పురుగుల్ని ఏరి ఒడ్డున పడేయాలని చాలా తాపత్రయపడేవాడు. ఫలితంగా తను కూడా ఆ బురద అంటించుకునే వాడు. వాళ్ళమ్మ అతన్ని దూరంగా తీసుకుపోయి, తల మీద స్నానం చేయించేది. ఆ పురుగులు మాత్రం బయట బ్రతకలేక మళ్ళీ ఆ బురదలోకే చేరేవి..."

"అసంభవం! ఎలా చేరతాయి -- చేరటానికి వీల్లేదు!" అరిచాడు అతను.

ఆమె నవ్వులో ఏదో బాధ కనపడిందతనికి.

"సముద్రంలోకి తాటి కాయలు విసిరేసే వాళ్ళం చిన్నప్పుడు. ఆ తాటి కాయలు అలా ఆ తెల్లటి నీళ్ళ మీద తేలుతూ పోవాలనీ, దిగంతాల అవతల ఉన్న స్వర్గాలను చూడాలనీ చాలా బలంగా విసురుతూ ఉండేవాళ్ళం. మళ్ళీ అలలు వాటిని బయటికే నెడుతుండేవి. ఆ అందాల్ని చూడటానికి ఆ తాటికాయలు నోచుకోలేదేమో అనిపించేది. కొన్ని అలలు లోపలకు తీసుకువెడుతున్నా, బలమైన ఇంకొన్ని అలలు బయటకే నెడుతుండేవి. ఎంత ప్రయత్నించినా, ఒక్క తాటి కాయనీ ఆ సముద్ర తరంగాల మీద అవతలి అంచుకు పంపించలేక పోయేవాళ్ళం!"

"నన్ను మభ్యపెట్టకు. నువ్వు చాల తెలివైన దానివి. చక్కటి మనసు ఉన్నదానివి. నీ కలా జరగనీయను" అన్నాడతను ఆవేశంగా.

"వద్దు!" అన్నదామె, ఒక్కసారిగా భోరుమని ఏడుస్తూ.

ఆమె కన్నీళ్ళు తుడిచాడతను.

ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. పెద్దగా విలపించింది.

కాసేపాగి అన్నాడు -- "ఎందుకు వద్దంటున్నావ్"? అని.

"కొన్ని బురద పురుగులు బురదలోనే ఉండడం మంచిది. బురదలోంచి బయటకు వస్తే, మీలాంటి వారికి ఆ బురద అంటటమేకాక ఆ పురుగుల ప్రాణంకూడా పోతుంది" అన్నది. దిండులో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

అతను అలానే ఆమెను చూస్తూ నించున్నాడు.

కాసేపాగి, "నే వెడతాను!" అన్నాడు.

ఆమె దిండు క్రింద మంచి ఆరు రూపాయలు తీసి ఇచ్చింది.

"ఉంచు!" అన్నాడతను.

"వద్దు!" అన్నదామె.

అతను ఆమెనోసారి సాదరంగా చూసి బయలుదేరాడు.

పోతూ పోతూ అడిగాడు -- "నీ పేరు" అని.

"మనిషి అని తెలుసుకోండి చాలు!" అన్నదామె. ✿